# కొత్త చిగుళ్ళు

నీలాకాశం కరిగి శరత్ కాంతిగా భూమిమీద వర్షిస్తోంది. బాపయ్య ప్రొటెస్ట్స్‌కి ఎదురు తిరిగి మార్తాండమ్మకి పోతున్నాను, కాఫీకని వేగంగా. రోడ్డుపక్కన 'ముదుసలి యొకతె - ముగ్గుబుట్టవంటి తలతో'- బిగ్గరగా చాలా బలంగా ముఖం ముడతల్ని దిక్కరించే కంఠంతో, నీలాద్రిరాజుని సిగ్గుపరిచే బూతులతో తన విచారాన్ని నలుదిక్కులా భావకవుల గుండెలదర చాటుతోంది. ఆమె విలువలేని పుసికట్టిన కన్నీటిధారలు రొమ్ముమీద పట్టుకున్న తేగల కట్టల్ని తడుపుతున్నాయి, దీనజన ఆర్తిగీతలవలె, చప్పున ఓల్డ్ హార్స్‌కి బ్రేక్ వేశాను.

"పడుచు అమ్మాయి కాదు. భ్రమపడుతున్నారు. కళ్ళజోడు తీసి తగిలించుకు చూడండి'' అంది ఓల్డు హార్సు.

"ఓల్డు హార్స్! నేను కాదు. నువ్వు తగిలించుకో కళ్ళజోడు, నువ్వింకా చాలా పురాతన కాలంలో బతుకుతున్నావు. ఎన్నాళ్ళయింది నువ్వో పత్రికని చూసి ! అందమైన యువతులు సినిమాల లోనేగాని, కథా వొస్తువులుగా పనికిరారిప్పుడు. మురికి ముసలి స్త్రీలూ, తమ శరీరపు లోపలి భాగాల్ని చేత్తో పట్టుకు చూసే భిక్షకులూ ఇప్పుడు హీరోలు. నీ పేరప్పుడే కీర్తి శేషం కూడా కాకండా సమసిపోయింది. తెలుగు వాఙ్మయంలో. చూడు, ముసలి కవులంతా అభ్యుదయ మాత్రలు వేసుకుని నవ యవ్వనులై వేసవి పాఠశాలలలో పరవళ్ళు తొక్కుతున్నారు. మనమింక ఉపేక్షచేస్తే, మృతజీవనులమై పోతాము. ఆ ముసలామెలోని లిటరరీ పాసిబిలిటీస్ గమనించు. ఈమె అక్కగారినే శ్రీ శ్రీ పాడాడు. ఈమె చెల్లెల్ని చూశాడా గోఖలే. పమిటవున్న కృష్ణశాస్త్రినిగా తయారు చెయ్యగలడు ఆగు'' అని అదమాయించి ఆపాను.

అరిగిపోయిన అణా ఇచ్చి కార్మిక కష్టఫలిత ఘర్మజల పరీతమైన బంగారు ఛాయలతో భూమాత కారుణ్యాన్ని చాటే తేగల కట్టని పట్టికెళ్ళాడుట, ఓ బూర్జువా విద్యార్థి. ఆ విద్యార్థి పూర్వీకుల శీలాల్లోని రహస్య ఘట్టాల్ని ప్రకటిస్తోంది. ఈ నిరపాయ నిర్మల అమాయిక వృద్ధ స్త్రీ.

అంతరాంతరంలో నాకు సానుభూతి తక్కువ కావడం చాతనేమో సదుద్దేశ్య సహితమైన నా ప్రశ్నలకి ఆమెనించి ఒక్క సమాధానమూ రాలేదు. ఆ విద్యార్థి తల్లిని చంద్రరేఖను వర్ణించినట్లు వర్ణిస్తోంది ఆమె. ఒక్క రెండణాల నాణెంతో ఆమె విచారాన్ని అరికట్టి, నా ధనికత్వం మీది ఆమె కోపాన్ని సమయింప చేశాను.

"ఈగలు ముసిరే బోసినోటి''లోంచి మబ్బుల్ని చీల్చుకొని వొచ్చే చందమామవలె చిరునవ్వు వెల్వడింది.



చలం

ఆమె నిజంగా చాలా వృద్ధురాలు. నడుం సరిగా నిలవలేదు. ధనం కింద మూలిగే నా హృదయంలోంచి కూడా దయ కలగకండా ఆపలేక, ఆమెను ప్రశ్నించాను.

అణాకాసుపడ్డ ఆటోమాటిక్ మెషినులోనించివలె ప్రత్యుత్తరాలు వచ్చాయి నాకు.

ఆమెకి దిక్కులేదు. అంటే ఇద్దరు కూతుళ్ళున్నారు. అల్లుళ్ళున్నారు. మనుమలున్నారు. కాని ఎవరూ చేరనీరు ఆమెని.

ఇంతలో మా పక్కకి ఒక నారింజకాయల కర్షకుడూ, ఒక గడ్డిమోపు కార్మికుడూ చేరి చూస్తున్నారు.

ఆ ఇద్దరు అల్లుళ్ళూ ధనము సంపాయించి బూర్జువాలై యీ ముసలమ్మని వెళ్ళగొట్టారనుకున్నాను. ఆ అన్యాయాన్ని భరించలేక తల్లి ప్రేమ సినీమాలో కన్నాంబ నటించింతరవాత కూడా. ప్రజలు ఇంత ధర్మ విరుద్ధంగా మాత్రు దేవతల్ని ఇట్లా హింసిస్తున్నారా అనే కోపంతో, "చూశావా?" అని ఓల్డుహోర్సుని ఒకతన్ను తన్నాను.

"ముసలమ్మా! నీకేం భయంలేదు, నేనున్నాను. నువ్వు మా ఇంటికి రా. నీ సంరక్షణ నేను చూస్తాను. నేను యవ్వన స్త్రీలకు రక్షణ నిస్తాననే మిషతో చేరతీసి, వారికి మానభంగ మొనర్చి మా ఇంటిపక్కన దీక్షితులుగారి ఆంధ్రదోమల మహాసభా మంటపాలైన సైడు కాలవల్లోకి ఈడుస్తున్నాననీ నా ప్రియ మిత్రులందరూ అపోహపడుతున్నారు. నా ధవళకీర్తిలోని ఆ మలిన రేఖను, నీ పాద ధూళిచేత పునీతం చేసుకుంటాను" అన్నాను ధైర్యంగా, రేషన్ సంగతి మరిచి.

"ఈ తేగలు అమ్ముకుని వొస్తాను" అంది.

"వాటి ఖరీదు నేనిచ్చేస్తాను. ఈ అందమైన ఎండలో నువ్వు వీటిని అమ్ముకుంటో వీధి వీధులు దిక్కులేకండా తిరగడం నేను భరించలేను. అదీగాక నువ్వు మళ్ళీ కనబడకపోతే, తిరిగి నీ వంటి నిర్భాగ్యపు మురికి ముసలమ్మ మళ్ళీ నా కెన్నాళ్ళకు లభ్యమౌతుందో! ఏ మాత్రం శుభ్రంగా వున్నా, కొంచెం ఏ మూల యవ్వనమున్నా, అందమున్నా నా మిత్రులు నన్ను క్షమించరు. నా మలిన చరిత్రకి విముక్తి వుండదు. నువ్వు ప్రత్యేకమైన అందవికార, అసహ్య అవతారమూర్తివి, నిన్ను వొదలను. నీ లోంచి నాక్కూాశింఅఎఅశ్రీఉఅవం చాలా కనపడుతున్నాయి. మన ఇద్దరి ఈ నిమిషపు సమ్మేళనం అనంతకాలం నించి నిర్దేశించబడి వుండినట్లు నాకు చాలా స్ఫుటమౌతోంది."

ఈ గొప్ప దీర్ఘ, రాల్లరగించగల ఉపన్యాసాన్ని చాలా విసుకుగా విని ఆమె.

"ఎంత ఇస్తా"రంది అనుమానంతో.

అనలేదు గాని, తియ్యమాటలు చెప్పి, ఆమె తేగల్ని స్వకీయాక్రాంతం చేసుకునేట్టున్నాడు ఈ మేకచర్మం కప్పుకున్న బూర్జువా పులి అని అనుమానించిన చూపు తోచింది నాకు ఆమెలో.

ఏవీ ఆ తేగలు! ఏ తేగల్ని, తిండిలేని కార్మికుడు, ఎండిన నేలను బంగారు వంటి ఘర్మసలిల బిందువులతో తడుపుతో తవ్వి, పిల్లలు చీకి, ఈగలు ముసిరిన తాటి టెంకల్ని గోతిలోనాటి, లోకకళ్యాణార్థమై పండించాడో. ఏ తేగ టెంకల్ని, సంసార మహాభారవహాయగు యే దొడ్డ ఇల్లాలు మట్టిగాజులు గణగణ ధ్వనులు చెన్నార, కుండలతో సలిలము తెచ్చి తడిపిందో, ఆ తేగల్ని నాపాడు దరిద్రపు కొరగాని, ఉచితంగా, అన్యాయంగా, గుమాస్తా పనిచేసి ప్రజల గొంతులు కోసి కార్మికుల్ని మోసపుచ్చి, మా ముత్తాత కూడపెట్టి ఇచ్చి నన్ను బూర్జువాని చేసిన చిల్లర డబ్బులకు ఆమ్మమన్నాను.

అయిదు కట్టల్ని చూపించింది. తమ సృష్టికర్త దరిద్రాన్ని చాటే ఎండు తేగల్ని.

"ఎంత ?" అన్నాను.

"పదణాలు."

"మరి కట్ట అణాకి అమ్మావుగా ఆ కుర్రాడికి?"

అన్నాను ఆ మాటలు అనలేక - కపటమూ, మోసమూ, ఇట్లాంటివి ఈ పాటకపు జనంలో ఎప్పుడూ వుండవనే సోదర కవుల పాటల్ని తోసివెయ్యలేక.

"వాడా!" అని మళ్ళీ బూతులు ప్రారంభించింది. ఆగదు.

ఇంక భరించలేక ఆమెకి పదణాలూ చెల్లించి, నా వెంట రమ్మన్నాను. తోవ పొడుగునా, నాకు అమ్మిన తేగల్ని తొరతొరగా తింటో నా వెంట బైలుదేరింది ఆమె. ఇంటి దగ్గిర ఆమెని వంట ఆమెకి అప్పగించి "చాలా జాగ్రత్తగా చూడు. ఈమెని వెళ్ళనీకు" అన్నాను.

అనేటప్పటికి నా వృద్ధ అతిథి కళ్ళెర్రచేసి, "ఎందుకు వెళ్ళనీదు?" అంది. ఆ గర్జనలో నాకు, నేను బ్రిటీషు సామ్రాజ్యపు స్వతంత్ర పౌరుని, స్వాతంత్ర సమరం సాగించిన కార్మికోద్యమ మూలవిరాట్టును, నా స్వాతంత్ర్యాన్ని అరికట్టచూసే హక్కు నీకెట్లా వొచ్చింది? అని ఆమె విప్లవ భేరీ నినాదం చేసినట్టయింది.

"నీకు వెళ్ళవలసిన పనేముందీ? రాత్రికి భోజనం చేసి ఇక్కడే వుండుగాని" అన్నాను హీనస్వరంతో.

"ఇప్పుడో?" అంది.

"టీ తాగుతావా?"

"ఆ తాగుతాను, తాగి వెళ్ళి రాత్రికి వొస్తాను" అంది, నాకు అమ్మిన మూడో తేగ తిని కట్టలోంచి నాలుగో తేగని బైటికి లాగుతో. అవును, ప్రేమవల్ల సానుభూతివల్ల నాలో నమ్మకం కలిగించి ఈమె దీన క్షుదార్తి దారుణ చరిత్రతో పత్రికల్నించి, మాసిపోతున్న నా సారస్వత కీర్తికాంతిని తిరిగి ప్రజ్వలింప చేసుకోవాలని, చాలా నేర్చైన కన్నింగ్ ప్లాట్ మనసులో వేసుకుని, "సరే, నీ ఇష్టం" అన్నాను.

బడికి చాలా గర్వంగా నడిపించాను నా ఓల్డు హార్సుని.

"చూశావా, ఆగనన్నావు. తెలివితక్కువ కుర్రదానివని వొప్పుకో ఇప్పుడన్నా, కాలంతో కదలాలి మనం కూడా. నీకీమధ్య వెనక పిర్రలకి తెల్లరంగు పూయించుకుని ఎర్ర అద్దం బిళ్ళ తగిలించుకున్నావా లేదా? "ముసలిదానినైనాను. ఎముకలు కిరకిర మంటున్నాయి. వేగం పోయింది. ఈ వయసులో నాకీ అందాలన్నీ ఏమిటి?" అన్నావా! దేశంలోని కవులందరూ పమిటలు వేసుకు అభ్యుదయిస్తోవుంటే, నన్నుమాత్రం ఇంకా పురాతన శృంగార రసాన్ని పిండుతూ కూచోమంటావా? చూసుకో.. ఎంత గొప్ప ప్రజానీక ప్రచారకమైన వచన బుర్రకథలు రాయపోతున్నానో?" అని వేగంలో బ్రేకులు బిగించి అదిలించాను. సిగ్గుపడి తలొంచుకుని మారుమాట లేకండా పరిగెత్తింది ఓల్డు హార్సు, తెల్ల పిర్రలు ఎగరవేసుకుంటో.

బళ్ళో కూడా, "ఎవరనుకున్నారో మీకు పాఠాలు చెప్పేది! రోజా మల్లే చూడకండి. ఈనాటి నుంచి కొత్త దృష్టితో గౌరవంతో, కొత్తచిగుళ్ళు ధరించిన వసంత వృక్షాన్ని మల్లే చూడండి నన్ను" అంటో కూచున్నాను. కాని స్టూడెంట్లు అదేం గమనించినట్టు అట్టే కనపళ్ళేదు నాకు.

"నా నవీన యోగ్యతను గమనించకండా మా హెడ్మాష్టరు నన్నో మీటింగులో రాత్రిదాకా చెట్టుకింద కూచోమన్నారు.

"నాకోసం ఇంటిదగ్గిర ఎవరు ఎదురు చూస్తున్నారో మీకు తెలుసునా? ఈ దేశపు వెన్నెముక, భూమి సారం salt of the earth.

తమ యుదకంబు వాహినులు త్రావని భంగి.

తన మూలిగల్లోంచి, రక్తం పిండి, ప్రజలకి తన దారుఢ్యాన్ని ప్రతిఫలం కోరక అర్పించిన త్యాగమూర్తి నాకోసం ఎదురు చూస్తోంది" అని నా చూపుల్లోంచి మౌనంగా తెలియచెయ్యాలని చూసినా, బూర్జువా విద్యలో మునిగి తేలే ఆయన తలకెక్కలేదు. సూర్యుడు ఆకాశాన్ని ప్రేతాగ్ని చితులతో, భూతాల అరుపులతో, క్షుధార్తి రక్తస్రావాలతో, ప్రపంచ ప్రళయ నినాదాలతో బాధిత ప్రజా హాహారవాలతో, ఆకళ్ళ అరుపులతో, శ్మశాన వాటికలో ధన పిశాచ కాళి లక్ష నాలికలతో, అధికార రాక్షస శేష సహస్ర ఫణభీషణ విషాధూమాలతో ప్రపంచాన్ని నించాడు. ఆ శాంత సాయంకాల సమయంలో.

నేనింటికి బైలుదేరేప్పటికి, ధనికవర్గ విజయాంధకారాలు లోకాన్నలుముకున్నాయి. కాని పడమట మాత్రం శుక్రుడు 'ఇంకెంతకాలం?' అన్నట్టు. ఆశాకాంతులతో చీకటిని చీలుస్తున్నాడు.

"ఏదీ, ఏదీ! నా కన్నుల కరువుతీర చూడనీ, ఏదీ! నా కీర్తి ధనం? కార్మికలోక హృదయదీపం? భారతక్ష్మా సౌభాగ్యమణి? ఏదీ?"

అంటో ఇంటో ప్రవేశించాను.

"ఎవరు? ఆ ముష్టిముండేనా? పోయింది. అప్పుడే నడిచింది" అంది మూర్ఖురాలు. నేనిచ్చే జీతం నలభై యేడు రూపాయలయ్యేట్టు నా దగ్గిర కూడబెట్టుకున్న ఆస్తి పిశాచి నా వంట ఆమె.

"ఎందుకు వెళ్ళనిచ్చావు? కొంప తీశావు. నా గుండె చీల్చావు. నా కథని నాశనం చేశావు. నా కీర్తిని కాల్చావు" అని దూకాను.

ఓల్డు హార్సు సకిలించింది.

నోరు ముయ్యమని దాని స్టాండ్‌ని ఓ తన్ను తన్ని నిలిపి, వొంటామె మీదికి తిరిగాను భీషణంగా.

"ఏం చెయ్యను? ఆకలేస్తోంది. తొరగా వంట చెయ్యమంది. మీకు దడిసి పప్పులుసూ, చాపల కూరా చేశాను. వడ్డించమంది. తినేముందు నల్లమందు పెట్టమంది. లేదన్నాను. మండిపడి, తనని ఎందుకు పిలుచుకు వొచ్చారని మిమ్మల్ని తిట్టి, బాగా తిని వెళ్ళిపోయింది."

"ఎక్కడికి వెళ్ళి వెతకను?" శ్రీరాముడన్నా అంత జాలిగా అని వుండడామాట.

"ఎక్కడో చెప్పింది ఇల్లు, పావుతులం నల్లమందు పట్టుకుని రమ్మంది మిమ్మల్ని, చీపిరి వెంకన్నట, తుళ్ళవారి వీధులో వెళ్ళండి" అని నవ్వింది ఆ హృదయం లేని నాన్ ప్రొడ్యూసర్.

నల్లమందు సంగతి సరిగా మనసులోకి తీసుకోడానికి వ్యవధిలేదు. నేను, దీపంలేని ఓల్డు హార్సుని మళ్ళీ రోడ్డుమీదికి తీసి ఎక్కి కదిలాను. ఆ తుళ్ళవారి సందు వెతుక్కుంటో అనేక వేలమంది ప్రియులకి గుడ్డి వెలుతురు నిచ్చి తోవ చూపిన నక్షత్రాలు, నాపై ప్రేమ కిరణాల్ని జీవితమంతా ప్రసరించిన నక్షత్రాలు నివ్వెరబోయి చూస్తున్నాయి. నా ఈ నవీన అన్వేషణని.

మామూలు పాటక గృహ పరిమళం, మురిగిన పేడ వాసన, నాకు తెలిపింది నాగోల్ చేరువకి వొచ్చానని. పక్క, ఇంటి ముసలాయన తను తలవూపాడు వెంకన్నగారి ఇల్లు పక్కదేనని.

తాటాకుల ఇంటి అరుగుమీద కిరసనాయిలు బుడ్డిదగ్గిర ఓ కుర్రాడు. బాతుల వేళ్ళ మధ్య చర్మమెందుకు వుంటుందో వ్యాకరణోక్తంగా కింద పడుకున్న గజ్జి కుక్కపిల్లకి వినిపిస్తున్నాడు.

"ముసలమ్మ వుందా?" అని అరిచాను సైకిలు గంట వాయించి!

"ఆ కుర్రవాడు కిరసనాయిలు పొగని కళ్ళనించి తుడుచుకుంటూ మాట్లాడలేదు. మళ్ళీ కసురుతో అడిగాను. లోపల్నించి ఒక ఆమె గుమ్మంలోకి వొచ్చి.

"ఎవరు?" అంది.

"ముసలమ్మ వుందా?"

"ఏం ముసలమ్మ?"

"మీ అమ్మ గావును, తేగలు అమ్ముతుంది?"

"అయితే?"

"వుందా?"

"వుందా!!!"

సంభాషణ చాలా జోరుగా నడుస్తోంది.

"ఉందా అన్నాను!" అన్నాను.

"వుందా అన్నారా? ఎవరు?"

"ముసలమ్మ?"

"ఏ ముసలమ్మ?"

"మీ అమ్మగావును..."

ఇట్లా ఈనాటి వరకూ ఆ సంభాషణ నడుస్తోవుండేదే. కాని ఇంతలో ఆ అబ్బాయి, ఇంకా బళ్ళో మాయంకాక మిగిలిన ఏ సహజ కార్మిక మేధాశక్తితోనో.

"అమ్మగావునే" అన్నాడు.

అప్పుడర్థమయింది గావును ఆ అక్కకి. చాలా తెలివిగలది గనక.

"అమ్మా! మా అమ్మా! మా అమ్మే నన్నమాట. ఎందుకు మా అమ్మ!"

"పని వుంది."

"ఏం పని?"

"మాట్లాడాలి."

"ఏం మాటలు?"

నిఘంటువులో పదాలకోసం తడుముకున్నాను. వ్యవహారం, వ్యాపారం, సంయోగం, ప్రజాసేవ, పరస్పర సహకారం ఇట్లాంటివి, కాని వీటికైనా "ఏం?" అని ముందు చేరిస్తే, మళ్ళీ అనంతకాల పర్యవసానం వరకు అట్లానే సంభాషిస్తో వుంటామని గుక్క తిప్పుకున్నాను. సాధారణంగా ఇన్ని మాటలూ అడిగి, చివరికి లేదనో, మాకు తెలీదనో అంటారు. అదికాక, ఎవరికోసం అడుగుతున్నామో వారిని హత్య చెయ్యడానికో, వారిద్వారా ఇల్లు కొల్లగొట్టడానికో వొచ్చినట్టు మాట్లాడతారు. ఏమీ తెలీని అమాయకులైన యీ పాటకజనం.

"మీ అమ్మ మా ఇంటో వుంటానని..."

"మా అమ్మ మీ ఇంటో ఎందుకు వుంటుంది?"

"వుంటానంది."

"ఎందుకు వుంటానంది?"

"నేను వుండమంటే."

"ఎందుకు వుండమన్నారు?"

సరే మళ్ళీ పాట మొదలా?

ఇంక చాతగాక గుటకలు మింగుతున్నాను. చదువుకునే కుర్రాడు ఆ పుస్తకం మడిచి, పువ్వులోని భాగాల్ని వొల్లె వేస్తున్నాడు. కీలకములు, పత్రములూ, కీటకములూ అంటో.

ఇంతలో వెనకనించి ఎవరో.

"ఎవరది?" అన్నారు.

అమ్మో! మొగ కంఠం.

"ఎవరో! అమ్మతో పనిట ఈయనకి" అంది.

"ఐతే!" అన్నాడు దూకుడుగా విసుగుతో.

మళ్ళీ మొదలా!

"ఇంటో లేదా!" అన్నాడు వెళ్ళిపోతో, చుట్ట నోట్లోంచి తియ్యకండానే.

"వుంది."

"అయితే..." అన్నాడు వెనక్కి తిరిగి.

ఆమె మాట్లాడలేదు.

వెడుతున్నాడు. ఏం చెయ్యను?

ఏల మంచి బుద్ధి పుట్టిందో చప్పున తిరిగి.

"ఏమిటి గాడిదలాగు అట్లా గుమ్మానికి అడ్డంగా నుంచుంటావు? పో మొద్దూ పిలు ముసలిముండని" అన్నాడు ఆమెని. ఆమె కదల్లేదు.

"కదులుతావా, వెమికలు విరగతన్ననా?" అని ఆమెని అని,

"శుద్ధ అడివి మొద్దు, దానికి బుద్ధిలేదు" అని వెళ్ళిపోయినాడు. గతిలేక ఆ ఇల్లాలు "రండి లోపలికి" అంది హీనస్వరంతో.

నా విజయ భేరిని ఓల్డు హార్సు జీనుమీద మోగించి లోపలికి నడిచాను. చీకటి, బస్తాలు, పెట్టెలు, పిడకలు.

ఆ వెనక దొడ్డివేపు పాకలో చుట్ట కాలుస్తో పడుకుంది నా కథానాయిక.

"ఎవరో వొచ్చారు నీకోసం."

"నాకోసం?" అంది చుట్టలోంచి.

"ఏం? వొచ్చేశావు?"

చప్పున ప్రాణం వొచ్చింది ఆమెకి. నా మీద ప్రేమ గౌరవాలు వెల్లివిరియ.

"తెచ్చావా?" అంది.

"ఏమిటి?"

"నల్లమందు."

"సాయింత్రం నించి తిట్టిపోస్తోంది. ఎవర్నో అనుకున్నాను. మిమ్మల్నేనా" అని మొదటిసారి నన్ను ఎగాదిగా చూసింది ఆ ఇంటామె. అని, కొంచెం సహృదయంగా.

"ఇదెక్కడ దొరికింది మీకు?"

"దిక్కులేదటగా? మీరెవ్వరూ చేరనీరుట."

"అందా? దిక్కులేదందా?" అంటో నిలబడ్డదల్లా విరగబడి నవ్వుతో కూలబడి, చేతిని వెనక నానించి ఒకటే నవ్వుతోంది. ముసలిది కోపంతో గురగురమంటోంది. ఆ నవ్వు విని ఆగాను. ఏం బలం, ఏం సంతోషం, ఏం కొంటెతనం! ఏమిటా కంఠం? సిగరెట్టు తీసి, వెలిగించుకునే మిషతో అగ్గిపుల్ల గీసి చూశాను ఆమెని.

పద్దెనిమిదేళ్ళుంటాయి. నవ్వుతో తొలగిన పైటని సద్దుకునే వుద్దేశ్యం లేదు. రవిక చిరుగుల మధ్య నక్షత్రాలు అద్దం చూసుకుంటున్నాయి. ఆ వొక్క దృశ్యంతో ఆమె మీది నాకసి అంతా కరగడమే కాదు. ఆవిరయ్యింది.

"ఎందుకు నవ్వుతావు?" అన్నాను పరిచయంగా.

"అయ్యో వెర్రిబ్రాహ్మడా? బ్రాహ్మలేనా! - అనుకున్నాను. కాదా? అవునా కాదా? ఇంతకీ పోనీలే దాని మాటలు నమ్మారా?" అని నవ్వుతోంది.

"ఏమిటే ఆ వెధవ నవ్వు. వాడు రానీ...." అని బూతులు పూత్తోంది. ముసలిది చొంగతో కలిసి.

"పదండి, ఇంటికి పొండి. దానితో ఏమిటి?"

అమె మాటల్లో వివేకం నాకు గోచరిస్తోంది. కాని స్పష్టంగా తెలిపే వివేకాన్ని అంగీకరించి వర్తిస్తే మానవులెందుకౌతారు. ఈ ఎండమావుల వెంట పరుగులెత్తుతో, ఎట్లా వొదలను. నా పురోకీర్తి సౌధపు పునాది శిలని ఎట్లా వొదిలిపోనూ?

"మరి..."

"మరీలేదు, గిరీలేదు, పదండి" అని నవ్వుతో ఓ తోపు తోసింది.

టెక్కుమీద వుండక పాటక జనంతో విద్యాధికులు కలిసి మెలగాలంటున్నారు. కాంగ్రెసు అధికార్లు. ఆ కారణంవల్ల ఆమెకి దగ్గిరగా జరిగాను.

"ఈ ముసలామెని, మీ తల్లిని, తిండి పెట్టకుండా ఇంట్లోంచి తరిమారట కదా. ఈ వృద్ధాప్యంలో ఏమైపోతుందనుకున్నారు? వొంట్లో సత్తువ వున్నన్నాళ్ళూ...."

చాలా సీరియస్ ధోరణిలో ప్రారంభించాను. బాగా చివాట్లు పెట్టాలి. యీ బుద్ధిలేని పాటక జనాన్ని అని బిడ్డల బాధ్యతలూ, ఆర్థిక స్తితీ, ఈ ముసలివాళ్ళకి కమ్యూనిస్టులు ఏం ఏర్పాట్లు చెయ్యబోతున్నారో. ఈ విషయాల మీద గంభీరోపన్యాసం తయారు చేస్తున్నాను నా మనో ఫ్యాక్టరీలో.

పక పకా నవ్వుతోంది ఆ పడుచు ఆమె. బూతుల్నీ మాటల్నీ, కోపపు శబ్దాల్నీ కలిసి వొదులుతోంది ముసలామె.

"దాని దగ్గిరకాదు అది మాట్లాడనీదు. ఇట్లారండి" అని నా జబ్బపట్టుకుని తీసుకుపోయింది చీకట్లోకి.

ఆ స్పర్శ బావుండడంచేత ఆమె వెంట నడిచాను. ఓ గేదెని దాటి వెనక చిన్న గడ్డివాము దగ్గిరికి చేరుకున్నాము సరే. ఇంకేముంది? చాలా వివరంగా ఆలోచించే చలం గడ్డి వాముల్ని ఏరాడు. తన ప్రియుల ప్రేమ రంగాలకి అనిపించింది. ఆమె అడగకండానే గడ్డివాములో కూచున్నాను. ఆమె నా పక్కన కూలబడి,

"ఆ సిగరెట్టు తీసెయ్యండి. అదెందుకూ అడ్డం? గడ్డివామంటుకుంటే నలుగురూ చూసిపోతారు."

కాని నా వ్యవహారంలో రొమాన్సు కలపతలుచుకోలేదు. ఈ ముసిలమ్మని తీసుకుపోవాలి నా వెంట.

"మరి కానీ...." అన్నాను.

"నేనా?" అంది నా మీద ఆనుకుంటో.

"ఇంత మంచిదానివి..."

ఎందుకు తల్లిని వెళ్లకొట్టావు అనబోయినాను.

ఏ మంచితనం చూసి అంటున్నానో ఆలోచించకండానే.

కాని తీరా...

"చుట్ట కాలుస్తావా" అన్నాను. పూర్వజన్మ సంస్కృతికి కట్టుబడి.

"కాల్చను సూడండి."

అని మామూలు సినీమా ఖుష్ చేసింది.

వేరుశనక్కాయలు గంటకింద తిన్న పరిమళం వేసింది. ఆ పవిత్ర కార్మికాంగన మధుర ముఖారవిందంలో.

"నీకు ఇంటో పనిలేదా?"

"లేదు. పొద్దుపోయిగాని రాడు."

"తాగుతాడా?"

"తాగడు. పిసినారి. కాని తంతాడు. బండ...ఇదేమిటి?" అని నా షర్టు జేబులోంచి రుమాలు తీసింది.

"భయపడకండి. తీసుకోను. నాకు రుమాలుంటే ఎక్కడ పెట్టుకుంటాను?"

ఎట్లా పెట్టుకోవాలో చూపి, ఇంక నా చేతిని తియ్యలేదు. రుమాలు మీది వట్టివేళ్ళ పరిమళం, మమ్మలి ఏకం చేసింది.

చాలా తొందరగా, ఉపోద్ఘాతాలూ, బెట్లూ, సిగ్గులూ, అనుమానాలూ, భయాలూ, ఏం లేకండా, ఆ గడ్డిమీదే, ముద్దు కృష్ణ వచనంవలె ధారాళంగా చలం గారి కథ సమాప్తి అయింది.

చాలా అందంగా శలవు తీసుకున్నాను. గొప్ప తృప్తితో. నేను ఓల్డు హార్సుని వెతుక్కుంటో వుండగా, లోపల్నించి పిలిచింది. కుఱ్ఱాడు ఇంగ్లీషు పుస్తకం తీసి ఘోరమైన ఉచ్ఛారణలో.

A man and a woman.

అని చదువుతున్నాడు. నా మనసులో ఆ వాక్యం పూర్తి చేసుకుంటో లోపలికి వెళ్ళాను.

"ముసలిదాన్ని తీసుకెళ్ళకండా వెడుతున్నావు" అంది. నా ఓల్డు హార్సు వాకిట్లో పకపకా నవ్వింది.

"మారదామని ఎంత యత్నిస్తేనేం ఎట్లా తప్పించుకుంటావు. కథ చివరికి పూర్వపు పంథాలోనే పడ్డది. పుటకతో పుట్టిన బుద్ధి...." అంటోంది నా ఓల్డ్ హార్స్.

"చప్పున తెలివి తెచ్చుకుని, ఆమె బుజాల్ని పట్టుకుని, ఆమె నవ్వుని పూయించేస్తో.

"మరి మీ అమ్మని..."

"అదా! దాన్నెవరూ వెళ్ళగొట్టరు? రోజుకి అర్ధరూపాయి నల్లమందు తెమ్మంటుంది ఆ ముండ. మా అక్క ఎంత లక్షణంగా చూసేది దీన్ని! దాని మొగుడికీ దానికీ తంపులు పెడితే మా బావ పక్కలిరక్కొట్టి తరిమాడు, మా రాజు ఈయన దయగానే చూస్తారు. కాని దీనికి..."

అంటో మళ్ళీ నా బుజాలు పట్టుకుని దగ్గిరికి లాక్కుని వేళ్ళాడుతోంది.

బైట కిఱ్ఱు చెప్పులు.

వొదిలింది నన్ను.

"ఇంకా వున్నావా?" అంటో వొచ్చాడు ఆ యోధుడు.

"ముసల్దాన్ని తీసికెడతామంటా రేమిటి?" అంది ఆమె.

"తీసుకుపోనీ, తెలిసి వొస్తుంది" అంటో గదిలోకి వెళ్ళాడు.

"రండి, తీసుకుపోదురుగాని," అని నన్ను మళ్ళీ దొడ్లోకి తీసుకెళ్ళింది. వొదలదు. ఏం ఆత్రుత! ఇంక మళ్ళీ తనకి ఎన్నటికి ఈ అదృష్టం కలుగుతుందన్నట్టు!

"ఎక్కడ మీ ఇల్లు?"

"చాలా దూరం."

"మళ్ళీ ఎప్పుడు?"

"ఎప్పుడో!"

"రారా? రారా? రారా?"

ఏడుస్తోంది.

"నన్ను వెళ్ళనీ... నీ మొగుడు..."

నా మాటలు వినపడటం లేదు.

"నా మీద ఒట్టు - నువ్వు కనపడకపోతే చచ్చిపోతాను. వొట్టెయ్యి... ప్రమాణం చెయ్యి..."

నా చేతుల్ని తన వొంటిమీదికి తీసుకుంటుంది. నా పెదిమల్ని మొహాన్ని కార్మికాధర సుధారసంతో తడిపేసింది.

తోసేసి వొదిలించుకుని ఓల్డు హార్సెక్కుతున్నాను.

లోపల్నించి అతను "ఏమండోయ్" అని కేకవేశాడు.

ఏమిటబ్బా! అని కొంచెం భయపడ్డాను.

"ఇదిగో ఇది పారేసుకున్నారు."

అని నా జేబురుమాలు, నాకిచ్చాడు - మరి ఆ వట్టివేళ్ళ పరిమళానికి ఏం సమాధానం చెప్పుకుంటుందో ఆమె.

"వీశ మూడణాల చొప్పున రెండు పలాలు రెండు తులాలు" అంటున్నాడు కుర్రాడు.

ఇంటికి తొక్కుతో, ఓల్డుహార్సు! నిన్ను అన్యాయంగా చాలా తిట్టాను. నా సంగతి నా కన్న నీకే బాగా తెలుసనుకుంటాను. మామూలు ప్రకారం రంగు చీరల దగ్గిరే వేగం మందగించు ఇంక ముసిలమ్మల గొడవ వద్దు.

"ఆంధ్ర సారస్వత కార్యాలయం మద్రాసు హైకోర్టు కట్టడాల్లోకి మార్చారు. ఇంక మనజోలికి ఎవరూ రారు నిద్రపోదాం పద" అన్నాను, ఉదయించే చంద్రుడికేసి చూస్తో.

◆ ◆ ◆

*రచనాకాలం : 1947, ఏప్రిల్, ఆంధ్రజ్యోతి మాసపత్రిక*

*ప్రచురణ : (కొత్తచిగుళ్ళు కథల సంపుటి) రమణస్థాన్ ప్రచురణలు, 1962,*